# మొబైల్ బార్

జీడిగుంట రామచంద్రమూర్తి




వాసుదేవరావు ఆ రోజే రిటైరై పోయాడు!

ఆ సందర్భంగా ఆఫీసులో అందరం కలసి–ఆ సాయంత్రం అతనికి వీడ్కోలు ఏర్పాటుచేశాం;

అతని 'రిటైర్డ్ లైఫ్' సాఫీగా సాగిపోవాలని ఆకాంక్షిస్తూ మిత్రులు చాలా మంది ఆ సభలో వుపన్యసించారు.

'వాసుదేవరావ్ ఆరోగ్యం చాలా మంచిదనీ, శరీర దారుఢ్యం చాలా గొప్పదనీ పేర్కొంటూ– ఖాళీగా కూర్చోకుండా ఏదైనా వ్యాపారం ప్రారంభించి, శేష జీవితాన్ని హాయిగా ఆనందంగా గడపమని'– మా ఆఫీసరుగారు ఆకాంక్షను వ్యక్తంచేశారు.

ఉపన్యాసాలన్నీ పూర్తయిం తర్వాత వాసుదేవరావ్ లేచి నిలబడి వినయపూర్వకంగా చేతులు జోడించి– ఆఫీసు సిబ్బందికంతటికీ పేరుపేరున కృతజ్ఞతలూ, ధన్యవాదాలూ చెప్పుకున్నాడు. 'ఆఫీసరుగారు ఆకాంక్షించినట్టుగా, తన శేష జీవితాన్ని పదిమందికీ ఉపయోగపడేలా చూసుకుంటా'నని హామీకూడా ఇచ్చాడు.

వీడ్కోలుసభ జయప్రదంగా ముగిసింది.... ఆఫీసు సిబ్బంది ఒక్కొక్కరే వచ్చి వాసుదేవరావ్‌కి 'షేక్‌హేండ్' ఇచ్చి మళ్లీ మరోసారి శుభాకాంక్షలు తెలియచేసి వెళ్లిపోయారు.

ఇక అక్కడ– నేమా, శాస్త్రీ, చౌదరీ, శేషాచలం మిగిలాం!....

"మరి మనం బయల్దేరదామా?"– అడిగాడు చౌదరి.

"మీదే ఆలస్యం!"– అన్నాడు వాసుదేవరావు.

"మూర్తిగారూ!...మీరు కూడా మాతో వస్తున్నారు!"– అన్నాడు చౌదరి నావైపు తిరిగి.

నాకు విషయం అర్థమైంది.

వాసుదేవరావ్ రిటైరైన సందర్భంగా అతనికిప్రత్యేకం 'మందుపార్టీ' ఇస్తున్నారన్నమాట!

మరో పది నిముషాలకు మేవంతా 'బోట్స్‌క్లబ్' చేరుకున్నాం. బారులో కంటే ఆ క్లబ్బులో 'మందు' చవగ్గా దొరుకుతుంది.... చౌదరికి అక్కడ 'మెంబర్‌షిప్' వుండటంవల్ల– ఎప్పుడైనా మేం పార్టీలు చేసుకోవాలంటే– అతనికి గెస్టులుగా అక్కడ వాలిపోతూంటాం....

"చెప్పండి! ఏం తీసుకుందాం?.... విస్కీ?"– అడిగాడు చౌదరి అందరం కూర్చున్న తర్వాత.

"రమ్మని 'విసిగి'ంచటం భావ్యం కాదు ఫ్రెండూ,"– అన్నాడు వాసుదేవరావు.... అతని మాటల్లోని శ్లేషార్థం తాలూకు జోకు పాతదేఅయినా–' రిటైరైపోయాడు కదా పాపం, బావుండదు'– అని మేవంతా నవ్వేశాం.

వాసుదేవరావు ఎప్పుడూ రమ్మే తాగుతాడు.... అందుకని చౌదరి 'రమ్మే' ఆర్డరిచ్చాడు.... బేరరు అందరిముందూ 'మందు గ్లాసులు' పెట్టి– ఐస్ ముక్కలు వేసి– సోడా కూడా పోశాడు.

"ఫర్ ది బెస్ట్ హెల్తాఫ్ వాసూ!"— అంటూ గ్లాసు పైకెత్తి ఛీర్స్ చెప్పాడు శాస్త్రి.

"అకాల మృత్యుహరణం, సర్వవ్యాధి నివారణ, త్రిబులెక్స్ రమ్ పాదోదకం పావనం శుభం— కొట్టవోయి భార తీయుడా— కొట్టు!"— వాసుదేవరావు కూడా తనగ్లాసు పైకెత్తి ఎప్పటిలాగే మంత్రం చదివాడు.

ప్రతిరోజూ పెగ్గో, రెండు పెగ్గులో లిమిట్‌గా మందు పుచ్చుకుని కడుపు నిండా కమ్మగా భోంచేసి— కంటినిండా సుఖంగా నిద్రపోతే మనిషికి ఏ రోగమూ రాదని ఎవరో ఎపుడో వాసుదేవరావుకి చెప్పారట!... అప్పట్నించీ అదీ వరస!...

గ్లాసులో మందు కొంచెం మా గొంతులో దిగేవేళకి, బేరర్ ఓ ప్లేటులో 'బాయిల్డ్ ఎగ్సూ' ఇంకో ప్లేటులో 'కాజూ నట్స్' తెచ్చి మా ముందు పెట్టేడు.

"ఇవాళ నాకు చాలా విచారంగా వుంది ఫ్రెండ్సూ!"—అన్నాడు వాసుదేవ రావు, తల పైకెత్తి ఆకాశంలోకి చూస్తూ.

"నిజమే గురూ! పాతికేళ్లుగా ఉద్యోగం చేసి ఓ రకమైన జీవితాన్ని అనుభవించిన తర్వాత, ఇపుడు రిటైరై— ఇంటిదగ్గర ఖాళీగా, గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవాలంటే కొంచెం విచారంగానే వుంటుంది!"— శేషాచలం కామెంట్ చేశాడు....

వాసుదేవరావ్ తల అడ్డంగా తిప్పేడు.

"నో! అందుకు నేను బాధపడటం లేదు. పదవినించీ, జీవితంనించీ ఏదో ఒకరోజున ప్రతి మనిషీ నిష్క్రమించ వలసిందే!.... 'కానీ మీలాంటి మంచి మిత్రులతో కలసి తాగే అవకాశం పోయిందే' అని బాధగా వుంది!"— అతని కళ్ళల్లో నీళ్లు కదుల్తున్నాయి.

"మరేంవర్రీ అవద్దుగురూ! ఉద్యోగం లోంచి వెళ్లిపోయావే గానీ— ఊళ్లోంచి వెళ్లిపోవటం లేదుగా?.... నీ కెప్పుడు మనసైతేఅప్పుడుసాయంత్రం పూట ఆఫీసుకొచ్చెయ్.... అందరం కలసి హాయిగా ఇక్కడకు వచ్చి 'మందు' కొట్టచ్చు!"— సలహా ఇచ్చాడు చౌదరి.

అంతలో హఠాత్తుగా— ఎవరో ఏడుస్తున్నట్టు వెక్కిళ్లు వినిపించటంతో— తృళ్ళిపడి పక్కకు తిరిగిచూశాను.

ఎవరో కాదు.... సాక్షాత్తూ శాస్త్రి! ..

నాలుగయిదు పెగ్గులు పడగానే— శాస్త్రి అలా ఏడవటం మామూలే!

ఒకసారి శాస్త్రితో మొదటిసారిగా అలాంటి అనుభవం ఎదురైనప్పుడు— అతని ఏడుపుకి కారణం అడిగాను.

"నైన్‌టీన్ ఫిఫ్టీఫోర్‌లో, నేను ఎస్సెల్సీ చదివే రోజుల్లో 'శారద' అనే అమ్మాయిని ప్రేమించాను గురూ! కాంచనమాలకంటే బ్యూటిఫుల్‌గా వుండేది.... కానీ ఏం లాభం?.... నేను లవ్ చేస్తున్నానని చెప్పేలోగానే ఆ పిల్ల నన్ను 'అన్నయ్యా' అని పిలిచి 'రాఖీ' కూడా కట్టేసింది!"— అంటూ బావురుమన్నాడు అప్పుడు....

సరిగ్గా నాలుగో పెగ్గు గొంతు దిగ్గానే— అదే కథ గుర్తుకొస్తుంది శాస్త్రికి!.... పక్కన ఎవరుంటే వాళ్ళకు ఏడుస్తూనే ఆ కథ చెప్తాడు....

కానీ....

ఇప్పుడు మొదటి పెగ్గుకే ఎందుకేడుస్తున్నాడో అర్థంకాలేదు.

సరిగ్గా అప్పుడే, దూరంగా మరో టేబులు దగ్గర కూర్చుని తాగుతున్న ఓ వ్యక్తి లేచి మా దగ్గరకు వచ్చాడు.

"హలో సార్! మీ శారద గుర్తొచ్చిందా?"— శాస్త్రి భుజంమీద చేయి వేసి అడిగాడు అతను.

అసలు అతనెవరో, అతనికి శాస్త్రి ఎలా తెలుసో, తెలిసినా ఎక్కువగా తాగినపుడు శాస్త్రికి శారద గుర్తొస్తుందనీ— వస్తే ఏడుస్తాడనీ కూడా ఎలా తెలుసో— మాకు తెలియక నేనూ, చలం, చౌదరీ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం.

"అబ్బే.... అదేం కాదండీ.... వీళ్ళంతా నా ఫ్రెండ్సు.... ఇతను రిటైరైపోతే— పార్టీ ఇస్తున్నాం!"— అంటూ వాసుదేవరావునీ, మమ్మల్నీ అతనికి పరిచయంచేశాడు శాస్త్రి

"అయిసీ! కేరీ ఆన్!"— అంటూ మళ్ళీ అతను తన టేబుల్ దగ్గరకు వెళ్ళిపోయాడు.

"ఎవరోయ్ ఆయన?"అడిగానుశాస్త్రిని.

"ఏమో.... నాకూ తెలీదు! ఓసారి బ్రాడ్వే బార్లో మేం ఇద్దరం అనుకోకుండా ఒకే టేబులుదగ్గర కూర్చోటం గుర్తుంది! .... బహూశా అప్పుడు నాలుగో పెగ్గులోనో, అయిదో పెగ్గు లోనో శారద గురించి చెప్పానేమో?"— అన్నాడు.

"అది సరే.... అసలు పాయింటు వదిలేశావ్! శుభమా అని మన వాసూకి ఫేర్‌వెల్ పార్టీ ఇస్తూంటే— ఇందాకా మొదటి పెగ్గుకే కన్నీరు పెట్టుకున్నావ్ ఎందుకూ?"— చౌదరి అడిగాడు.

మళ్ళీ శాస్త్రి ముఖంలో రంగులు మారిపోయాయి.... కళ్ళల్లోకి విచారం కమ్ముకొచ్చింది.

"ఈ మధ్య 'మందు' రేట్లు దారుణంగా పెరిగిపోయాయి గురూ! మొన్న మొన్నటిదాకా పదిహేను రూపాయల కొచ్చే 'మందు' ఇప్పుడు పాతిక రూపాయలయిపోయింది. మందుఖర్చు నాకు నెలకు నూటయాభై అయ్యేది.... ఇకనించీ రెండువందలయాభై అవుతుందని తల్చుకుంటే గుండె చెరువై పోతోంది!"— దిగులుగా అన్నాడు.

"నిజమేనోయ్! గవర్నమెంటుకి 'మందుచూపు' బొత్తిగా ఉన్నట్టులేదు... మందు రేట్లు ఇంత దారుణంగా పెంచేయటం వల్ల ఎలాంటి నష్టాలు

సంభవిస్తాయో ఊహించలేదు!" — శేషాచలం కామెంట్ చేశాడు.

"ఎలాంటి నష్టం సంభవిస్తుందం టావ్?"_ అడిగాను.


"బారుల్లో బిజినెస్ పడిపోతుంది.... టిప్పుల్తో బ్రతికే బేరర్లు ఎందరో అల్లాడిపోతారు... మందుపార్టీలు కొట్టి స్నేహితుల్ని సంపాదించుకునే అవ కాశాలూ, మందుసీసాలు సప్లయ్‌చేసి ఉద్యోగాలూ, ప్రమోషన్లూ తెచ్చుకునే అవకాశాలూ సన్నగిల్లిపోతాయ్... పైగా 'మందు' కొడితేనే గానీ పనిచేయలేని మనుషులూ_మందు పడితేనేగానీ కాగితం మీద కలం పెట్టలేని రచయితలూ, కవులూ ఎందరో వున్నారు... వాళ్ళంతా ఏమైపోవాలి?"_ ఆవేశంగా అన్నాడు శేషాచలం.

అతను చెప్పిన దాంట్లో యథార్థం వుందేమో అనిపించింది.

"నువ్వన్నది కరక్టే! ఇంక చాలా మంది సారాదుకాణాల దగ్గర బారులు తీర్చాల్సిందే!.... అక్కడయితే సరుకు చీప్‌గా దొరుకుతుంది!" అన్నాడు చౌదరి నవ్వుతూ.

"షర్లే!.... ఇంటిముందు రాజాలా బతికి_ఇంటివెనకాల బొచ్చె తన్నేసినట్టు_బారుల్లో ఫ్యానుకింద, సోఫాలో కూర్చుని అద్దాల బీరువాల్లోంచి విస్కీలూ, రమ్ములూ తెప్పించుకుని_ అందమైన గాజు గ్లాసుల్లో పోసుకుని, ఆపై అయిసు ముక్కలు కూడా వేసుకుని తాగే, మన లాంటి 'వైట్ కాలరు మనుషులు'_ ప్రభుత్వ సారా దుకాణానికి వెళ్ళి అక్కడి అలగాజనంతోపాటు, శుచీ శుభ్రత లేని గ్లాసుల్లో సారా తాగ్గలమా? నో.... నెవ్వర్!"_ శాస్త్రి ఏడుస్తూ అన్నాడు.

కర్చీఫ్ తెచ్చుకోలేదు కాబోలు, చొక్కాతో తుడుచుకునే ప్రయత్నం




చేస్తుంటే_ అతన్ని వారించి, వాసుదేవ రావ్ తన కర్చీఫ్ తీసి అందించాడు.

"నువ్ అనవసరంగా అధైర్యపడకు శాస్త్రీ!.... నీకో శుభవార్త చెప్పబోతు న్నాను!"_ అన్నాడు అతని భుజం తట్టి.

శాస్త్రి కళ్ళు తుడుచుకుని_ వాసుదేవ రావ్ వైపు చూశాడు ఆసక్తిగా.

"ఇందాక ఆఫీసులో జరిగిన వీడ్కోలు సభ సందర్భంగా నేనో వాగ్దానం చేశాను.... గుర్తుందా?"_ అడి గాడు వాసుదేవరావు.

"ఏమిటీ?" అందరం ఒకేసారి అడిగాం.

"నా రిటైర్డ్‌లైఫ్ పదిమందికీ ఉప యోగపడేలా చూసుకుంటానని హామీ ఇచ్చాను!"

"కరక్టే!" మళ్ళీ కోరస్‌లో అన్నాం.

"సో, దేముడు చల్లగా చూస్తే రేప ట్నుంచీ నేను ఓ కొత్తరకం వ్యాపారం మొదలుపెడుతున్నాను!"_

"వ్యాపారమా?"

"యస్!... వ్యాపారమే!... మొబైల్ బార్ సర్వీస్!"

"అంటే!"

"పొద్దున్నే పాలవాడు ఇంటింటికీ వెళ్ళి పాలుపోసి వెళ్ళినట్టుగా_చీకటిపడే ముందు నేను ఇంటింటికి వెళ్ళి 'మందు' పోస్తానన్నమాట!" గర్వంగా చెప్పాడు వాసుదేవరావు.

"ఆడవాళ్ళంతా కలసి నీమీద దండ యాత్రకు వస్తారేమో జాగ్రత్త!"_ హెచ్చరించాడు శేషాచలం.

"అక్కడే నువ్ పొరపాటు పడు తున్నావ్!.... తాగుడికి అలవాటుపడ్డ మనిషి ఎలాగైనా తాగుతాడు.... తమ మొగుళ్ళు వీధిలో ఎక్కడో తప్పతాగి పడిపోయేకంటే_ ఇంట్లో తమ కళ్ళ ముందు తాగటమే బెటరనుకుంటారు పెళ్ళాలు.... అయినా నేను మరీ అంత పబ్లిగ్గా అమ్ముతాననుకుంటున్నావా?.... నో!.... మా కాలనీలో మందుకొట్టే వాళ్ళ అడ్రసులు తీసుకుంటాను.... కేవలం వాళ్ళయింటికే వెళ్ళి 'వాడుక' పెట్టుకుంటాను!" చెప్పాడు వాసుదేవ రావు.

"అది సరే!.... ఇంతకీ 'సరుకు' ఎక్కణ్ణించి తెప్పిస్తావ్?"_శేషాచలానికి అనుమానం వచ్చింది....

"ప్రభుత్వ సారాదుకాణంలో 'హోల్ సేల్' రేటులో కొంటాను.... లీటరుకి ఓ రెండ్రూపాయలు లాభం వేసుకుని 'రిటైల్'గా అమ్ముతాను!.... దట్సాల్!"

"ఏది ఏమైనా ఇదో కొత్తరకం వ్యాపారం.... ఇవాళ మన దేశ జనాభాలో

నూటికి ఏభై మంది తాగుతున్నారు.... అయితే అందరూ విస్కీ-రమ్ములూ, బ్రాందీబీర్లు తాగలేరు.... ఎంతోమంది ప్రభుత్వ సారా తాగుతున్నవాళ్లు ఉన్నారు.... పైగా ఇవాళ 'మందు' ధర పెరిగిపోయింది కనుక- దానికి అలవాటు పడ్డ జీవాలు మరికొన్ని 'ప్రభుత్వ సారా తప్ప అన్యథా శరణం నాస్తి' అనుకోవచ్చు.... కాబట్టి మన వాసుదేవరావు ప్రారంభించే ఈ వ్యాపారం 'మూడు విస్కీలూ- ఆరు రమ్ములు'గా అలరార గలదని ఆశిద్దాం!"- ఆనాటి మందు కార్యక్రమానికి ముగింపు మాటగా లేచి నిలబడి మరీ చెప్పాడు చౌదరి....

అందరం మరోసారి వాసుదేవరావ్‌కి శుభాకాంక్షలు తెలియపరచి ఇళ్ళకు బయల్దేరాం!

## 2

అన్నట్టుగానే 'మొబైల్ బార్ సర్వీస్' ప్రారంభించాడు వాసుదేవరావు. తాను వుంటున్న కాలనీలో ఓ అరడజను మంది మిత్రుల్ని కలుసుకుని వాళ్ళకు ప్రతిరోజూ రెండు పావులు మందు పోసేందుకు వాడుక పెట్టుకున్నాడు. మందుతోపాటు లాగించేందుకు ఉల్లిపాయ పకోడీలూ ఉడకబెట్టిన కోడిగుడ్లూ, వేయించి కారంచల్లిన పల్లీలూ వగైరా సరుకూ్కడా సప్లయి చేస్తున్నాడు.

'బయట ఎక్కడో గంటల తరబడి కూర్చుని తాగి, ఏ అర్ధరాత్రో సిటీబస్సు దొరక్కపోతే ఆటోకి అసలురేటు కంటే అంతోఇంతో ఎక్కువిచ్చి ఇంటికి చేరుకునే కంటే- ఓ పావలా, అర్ధా ఎక్కువైనా ఇంట్లోనే కూర్చుని తాగటం హాయి కదా'-అనే అభిప్రాయం చాలామందిలో ఏర్పట్టంవల్ల- ఈ వ్యాపారం ప్రారంభించిన మూడునెలలకే- వాసుదేవరావుకి వాడుకలు ఎక్కువయ్యాయి.... చుట్టుపక్కల కాలనీలకూ్కడా వెళ్లి 'మందు' పోయవలసిన పరిస్థితి ఏర్పడింది....

సైకిలుమీద వెళ్ళటంవల్ల- లేటవుతోందని అప్పుడప్పుడు కస్టమర్లు విసుక్కోవటంతో- టైం కలసొస్తుందని ఓ సువేగా కొన్నాడు.... అతనికిప్పుడు నెలకు నాలుగువందల దాకా లాభం కనిపిస్తోంది.

వాసుదేవరావ్ ప్రారంభించిన ఈ వ్యాపారం లాభసాటిగా వుంటోందని తెలుసుకున్న మరికొంతమంది తమతమ కాలనీల్లో కూడా-మందు వాడకందార్లకు, సాయంత్రం పూట మందుపోసే 'పార్ట్ టైం బిజినెస్' ప్రారంభించారు.

* * *

"ఏమోయ్.... విన్నే!"- ఆరుగంటలకు ఆఫీసునించి ఇంటికివచ్చిన ఆంజనేలు వాలుకుర్చీలో కూర్చుంటూ భార్యను పిలిచాడు.

"ఏమిటీ!" వంటింట్లోంచే అడిగింది ఆవిడ.

"మందుపత్రా!"

"ఇవాళ మందువాడు రాలేదు!"

"రాలేదా?.... రోజూ అయిదింటికే వచ్చేవాడు- ఇవేళ ఎందుకు రాలేదో?.... ఈ నెలలో ఇదప్పుడే నాలుగోసారి మానేయటం! ఇలా చెప్పాపెట్టకుండా నాగాలు పెట్టేస్తే ఎలా?-" వంటింట్లోంచి వచ్చిన భార్యమీద కోప్పడ్డాడు.

"ఇది మరీ బావుంది! అతని మీద కోపం నామీద చూపిస్తారెందుకూ?"—

"ఇంట్లో వుండి రోజూ మందు పోయించుకునేది నువ్వేగా?"

"మందు పోయించుకునేది నేనే అయినా— తాగేది మీరేగా?"-

"రైటే?....నేనే తాగుతున్నాననుకో! కానీ అతనొచ్చే వేళకు నేను ఇంట్లో వుండను కదా?.... అందుకని నువ్వే అతనికి ఖచ్చితంగా చెప్పాలి సరిగ్గా పొయ్యమని.... అయినా అతను మనకి ఉత్తినే పోయటంలేదు.... బయట దుకాణంలోకంటే పావుకి పావలా ఎక్కువిస్తున్నాం!....ఇలా అస్తమానూ నాగాలు పెడితే- అతన్ని మాన్పించి ఇంకోచోట వాడుక పెట్టుకుంటాం అని చెప్పు!.... ఇవాల్టికి వెంకట్రావ్‌గారింటికి వెళ్ళి, వాళ్లావిడను అడిగి ఓ గ్లాసుడు మందుంటే ఇవ్వమను!.... రేపు ఇచ్చేద్దాం!"-

"ఇంతకు ముందే వెంకట్రావ్‌గారి భార్య మనింటికొచ్చింది మందుకోసం!"

"అదేం?.... వాళ్ళ 'మందువాడు' కూడా రాలేదా ఇవాళ?"_

"వాళ్ళింటికి రాజమండ్రినించి ఎవడో చుట్టం వచ్చాట్ట! ఓ పావు ఎక్కువ పొయ్యమంటే వాళ్ళ మందువాడు లేదన్నాట్ట.... అందుకని- మనింటికొచ్చింది అప్పుకోసం!"

"ఏడ్చినట్టే వుంది! ఇప్పుడెలా?"_ జుట్టు పీక్కున్నాడు ఆంజనేలు.

* * *

ఆ రాత్రి అన్నంముందు కూచున్న అవధాని- అలవాటు ప్రకారం ముందుగా, గాజుగ్లాసులో వున్న మందు కొంచెం పుచ్చుకున్నాడు...ఏం తేడా కనిపించిందో ఏమిటో పక్కనున్న భార్యను అడిగాడు-

"ఏమిటీ?.... మందిలావుందీ?"


"ఎలావుందీ?"

"రుచీపచీ లేదు!.... వుత్తి నీళ్లు తాగుతున్నట్టే వుంది!" మరో గుక్కెడు తాగి మరీ అన్నాడు....

"ఏమో?.... ఈ మధ్య మన వీధి చివరి శ్యామలరావ్‌గారూ వాళ్ళింట్లో అద్దెకుంటున్న శ్రీరాములుగారూ కూడా మన 'మందువాడి' దగ్గరే పోయించుకుంటున్నారు.... వాడుకలు ఎక్కువయ్యాయని- మందులో నీళ్లు కలిపేస్తున్నాడో ఏమిటో- ఖర్మ!"- చెప్పింది ఆవిడ.

"రేపు వాడొచ్చినప్పుడు చెప్పెయ్!... పోస్తే మంచిగా పొయ్యమను.... లేకపోతే మానెయ్యమను.... ఈ కాలనీలో 'మందు'పోసేవాళ్లు ఇంకా చాలామంది వున్నారు!"- విసుక్కున్నాడు అవధాని.

* * *




ఇలా ఇంటింటికీ మందు తెచ్చిపోసే వ్యాపారాన్ని చాలామంది ప్రారంభించారు.... వ్యాపారంలో పోటీని తట్టుకోటానికి ఒక్కొక్కరు ఒకో రకమైన 'ఇన్‌సెంటివ్ స్కీం' కూడా ప్రవేశపెట్టారు.

"రోజుకి నాలుగు పావులు మందు పోయించుకునేవారికి ఓ కోడిగుడ్డు వుచితం!"– అని ఒకరంటే–

"ఆరు గాజుగ్లాసులు ఉచితం!"– అని మరొకరూ, వాడకందార్లను ఆకట్టుకుంటున్నారు.

"అన్నానికి ముందు–

అరగ్లాసుడు మందు–

ఆరోగ్యం పొందు!"– వంటి ప్రకటనలను కూడా రాయించి 'మందువాళ్లు' తమతమ వాహనాలకు తగిలించుకుంటున్నారు.

"వాసూ! రేపటినుంచీ మాకో లీటరు మందు కావాలి?....

మాక్కూడా ఓ అరలీటరు పోస్తూండవయ్యా వాసూ!

వాసూ! ఓ పావు మందిస్తావా?....

నాయనా వాసూ! ఎల్లుండి మా ఇంట్లో పెళ్ళి.... రాత్రి డిన్నరుకి ఓ యాభై లీటర్ల మందు కావాలి ....ఏమిటీ? వాసూ మందుకి ఇంత డిమేండా?....

హ్వాహ్వాహ్వా!.... వందలాది ప్రజలు వాసూ పోసే మందునే మక్కువతో తాగుతారు.... మీరు కూడా ఈ రోజే వాసూ మొబైల్ బార్‌లో మందు కొనండి!"– వంటి వ్యాపార ప్రకటనలు రోజుకి మూడుసార్లు వివిధభారతి జనరంజనిలో మారుమ్రోగిపోతున్నాయి....

ఈ వ్యాపారంలో లాభాలు బాగా వస్తున్నాయని గ్రహించిన ప్రభుత్వం ప్రత్యేకించి ఒక కార్పొరేషన్‌ని ఏర్పాటు చేసింది. ప్రయివేటు వ్యక్తులెవరూ ఇంటింటికీ వెళ్ళి పోయకూడదని చట్టం చేసింది. కార్పొరేషన్ నియమించిన వ్యక్తులే మందు పోయాలి. ఈ విధానం వల్ల చాలమంది నిరుద్యోగులకు ఉపాధి లభించింది.... పాలచీట్లు అమ్మినట్టుగా కార్పొరేషన్ ముందుగానే 'మందుచీట్లు' అమ్మటం ప్రారంభించింది....

ఒకరోజు అనుకోకుండా మందు కార్పొరేషన్ ఉద్యోగులంతా సమ్మె ప్రారంభించారు. దాంతో మందు సరఫరా ఆగిపోయింది....

అప్పటికే 'మందు'కి బాగా అలవాటు పడిన ప్రజల జీవితాల్లో ఓ రకమైన నిర్లిప్తతా నిర్వేదం చోటుచేసుకున్నాయి. చైతన్యమే ఆగిపోయినట్టయింది....

పొద్దున్న నిద్రలేవాలంటే బద్ధకం... ఆఫీసుకి వెళ్లాలంటే చిరాకు.... వెళ్ళినా అయిదయ్యాక తిరిగి ఇంటికి బయలు దేరాలంటే చిరాకు....

"ఏమండీ.... మీ గెడ్డం మాసిపోయిందండీ"– అని భార్య అంటే–

"మందే లేకపోయిం తర్వాత గెడ్డం మాసిపోతే యేం? ఉద్యోగం ఊడిపోతే యేం?"– అంటూ భర్త వేదాంతం మాట్లాడుతున్నాడు.

చాలామంది– మందు లేకపోవటం వల్ల పిచ్చివాళ్లుగా తయారయ్యారు– అకాశంలోకి వెర్రిగా చూస్తున్నారు.... పెళ్లాం పిల్లల్ని పరాయివాళ్లుగా భావించి 'ఏవండీ'– అని కూడా పిలుస్తున్నారు.

తమ భర్తల పిచ్చిధోరణిని గమనించిన ఇల్లాళ్లు 'మందు కార్పొరేషన్' ఉద్యోగుల సమ్మె విరమించాలి'– అని నినాదాలు చేస్తూ అసెంబ్లీకి ఊరేగింపు కూడా జరిపారు....

### 3

"అవును, సమ్మె విరమించాల్సిందే!"–

"ఏవండోయ్!.... బారెడు పొద్దెక్కింది.... పలవరింతలు చాలించి నిద్ర లేవండి!"– అంటూ మా అవిద నన్ను తట్టి లేపేసరికి కల చెదిరిపోయి మెలకువ వచ్చేసింది.

"పలవరించానా?" అడిగాను అయోమయంగా.

"అవును! 'సమ్మె విరమించాల్సిందే' అంటున్నారేమిటో!.... ఈ మధ్యనే మీ ప్రభుత్వోద్యోగులంతా సమ్మె చేశారు.... మళ్లీ సమ్మె చేస్తున్నట్టుగాని కలొచ్చిందా కొంపదీసి?"– అడిగింది శ్రీమతి.

"అదేం కాదులే!"– నాకు వచ్చిన కల గురించే ఆలోచిస్తూ బదులుచెప్పాను.

ఖర్మచాలక వాసుదేవరావు మొబైల్ సర్వీసు ప్రారంభిస్తే– నాకు కలలో కనిపించినట్టుగానే జరుగుతుందేమోనని భయంవేసింది....

గబగబా కాలకృత్యాలు తీర్చుకుని వాసుదేవరావ్ ఇంటికి పరుగెత్తాను....

అపుడే నిద్రలేచిన వాసుదేవరావ్ నన్ను చూడగానే ఆహ్వానించి కాఫీ ఇచ్చాడు....

"మొబైల్ బార్ సర్వీసు ప్రారంభిస్తానని రాత్రి చెప్పావ్ గుర్తుందా?"– అడిగాను కాఫీ తాగుతూ.

"అవునోయ్!.... కానీ ఆ ఆలోచన మానుకున్నాను!– " అన్నాడు.

నేను తృప్తిగా నిట్టూర్చేటంతలో–

"రాత్రి నాకో కలొచ్చిందోయ్!"– అన్నాడు వాసుదేవరావ్.

"కలా?".... ఆశ్చర్యపోయాను....

"ఏమిటా కల?"– అడిగాను ఆత్రంగా.

వాసుదేవరావ్ చెప్పటం ప్రారంభించాడు.

"నేను మొబైల్ బార్ సర్వీసు ప్రారంభించాను!... ఎంతోమంది నా దగ్గర వాడుకలు పెట్టుకున్నారు.... వ్యాపారం జోరుగా సాగిపోతోంది.... సరుకు ఇంట్లో వుంటుంది కదా! అందుకని మా అవిడా పిల్లలు కూడా 'మందు' తాగటం ప్రారంభించారు.

"నువ్వు మందు తాగుతావా?"– అని మా ఆవిణ్ణి అడిగాను....

"మగాళ్ళు తాగ్గాలేంది మేం తాగితే తప్పా?.... మీరు ఎలాంటి 'థ్రిల్లు' కోసం తాగుతున్నారో మేం కూడా అందుకే తాగుతున్నాం .... మీ మగాళ్ళయితే వీధిలో తాగొచ్చినా ఫరవాలేదు. కానీ మా ఆడవాళ్ళం అలాంటి సాహసం చేయలేం! హాయిగా ఇంట్లోనే ఇలా తాగితే గుట్టుగా ఉంటుంది!–"అని చెప్పిందోయ్ కలలో.... నేను మొబైల్ బార్ సర్వీస్ ప్రారంభిస్తే, కొంపతీసి నా కల నిజమైతే– అపుడు నేనేం కావాలి?.... అందుకే ఆ ఆలోచనలకి ఫుల్‌స్టాప్ పెట్టేశాను!"– అంటూ వాసుదేవరావ్ చెప్పటం ముగించి నావైపు చూశాడు....

నేను మనసులోనే సంతోషించాను...

"ఇంతకీ నువ్వింత పొద్దున్నే రావటానికి గల కారణం ఏమిటో చెప్పలేదు!" అన్నాడు వాసుదేవరావ్ కొన్ని క్షణాల తర్వాత....

"అబ్బే!....మరేం లేదు!.... ఉత్తినే అలా వెడుతూ– ఓ సారి నిన్ను చూసిపోదామని వచ్చాను!"– నా కొచ్చిన కల గురించి అతనికి చెప్పటం అనవసరం అనిపించి– అతని దగ్గర శలవు తీసుకున్నాను ...